క్లుప్తంగా

దుర్గాదేవి ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట ఉత్సవంలో పాల్గొన్న నిర్వాహకులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవాని పాలెంలో దుర్గాదేవి ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. లక్కీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లో పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి బర్ల బాలకృష్ణ, నక్కవానిపాలెం గ్రామ కమిటీ సభ్యులు పందిరి రాటకు పూజలు చేశారు. ఇక్కడ దసరా నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని అసోసియేషన్ ఆర్గనైజర్ గుప్తాజీ తెలిపారు. అక్టోబర్ 3న దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట, 12న అనుపు ఉత్సవం నిర్వహిస్తామన్నారు. నవరాత్రి వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కుంకుమార్చనలు, భజన కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో రాజా శ్రీనివాస్, రాజేష్, పవన్, చిన్న, రామిరెడ్డి, రాజు, అశోక్, గోవింద్, దుర్గా జగదీష్, రూకేష్, మురళీ, శంకరమూర్తి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

'ప్రపంచ శాంతి-అభివృద్ధి'పై సదస్సు రేపు

సీతంపేట: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 22న బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో 'ప్రపంచ శాంతి-అభివృద్ధి' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్టు ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం చైర్మన్ నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తారని, వివిధ మత పెద్దలు పాల్గొని శాంతి ప్రతిజ్ఞ చేస్తారని చెప్పారు. ప్రపంచ శాంతి కాంక్షించే వారందరూ సదస్సులో పాల్గొనాలని కోరారు.

నేడు సీతంపేటలో మహా అన్నదానం

సీతంపేట: దుర్గాగణపతి నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సీతంపేట కూడలిలోని ఆలయం వద్ద మహా అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి గోవింద్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఆరు వేల మందికి అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మర్రిపాలెం: అక్కయ్యపాలెం పరిధిలో హైటెన్షన్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్, రైతుబజార్, ఆకాష్ జూనియర్ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇది ముంచే ప్రభుత్వం

- 100 రోజుల కూటమి పాలనలో అన్నీ వైఫల్యాలే
- అమలు కాని సూపర్ సిక్స్ పథకాలు
- నెరవేరని పాలకుల హామీలు
- నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి

సీతంపేట/సీతమ్మధార/మురళీనగర్/మర్రిపాలెం: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి జాడ ఎక్కడా కనిపించలేదు. అన్నీ వైఫల్యాలు, ప్రచార ఆర్భాటాలే. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. హామీలు నిజమని నమ్మి, తమ తలరాతలు ఎంతో గొప్పగా మారుస్తారని ప్రజలు కూటమికి పట్టం కట్టారు. వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలను అన్ని విధాలుగా నిరాశ పరిచిందనే చెప్పాలి. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఆపేశారు. కొత్తగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుపై ఇప్పటికీ స్పష్టత లేదు. పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తారో తెలియని పరిస్థితి. దీంతో నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి నెలకొంది.

ఏ దాఖలాలు లేవు..

కనీసం ఈ వంద రోజుల్లో ఒక్కరికైనా కొత్త రేషన్ కార్డు గానీ, కొత్తగా పింఛన్ గానీ మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఉచిత ఇసుక పేరుతో ప్రజలను, భవన నిర్మాణదారులను మభ్యపెడుతున్నారు. గత ప్రభుత్వ ఇచ్చిన ధర కంటే రెట్టింపు చెల్లించడానికి సిద్ధమైనా రాష్ట్రంలో, నగరంలో ఇసుక దొరకని పరిస్థితి. తీవ్రమైన ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత కార్మికులు పనులు లేక పస్తులుంటున్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం, వారు చేపట్టిన అభివృద్ధి పనులను విధ్వంసం చేయడంపైనే కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని వంద రోజుల పాలన ద్వారా అవగతమవుతోంది.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన పెనుమత్స విష్ణుకుమార్‌రాజు ఈ వంద రోజుల్లో ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి కనీసం ఒక్కరోజైనా వార్డులో పర్యటించిన దాఖలాలు లేవు. నియోజకవర్గ ప్రజలకు ఏమి చేస్తారో ఎన్నికల ముందు చెప్పలేదు, ఇప్పటికీ చెప్పడం లేదు. ఏమి చేస్తారో అని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.



ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు (ఫైల్)



సూపర్ సిక్స్ పథకాలపై సోషల్ మీడియాలో పోస్ట్

వంద రోజుల వైఫల్యం



బాబు సూపర్ సిక్స్, బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు. వంద రోజుల పాలన పూర్తి చేశారు. ఒక్క సంక్షేమ పథకం లేదు, ఎక్కడా అభివృద్ధి జరగలేదు. ఎప్పుడూ గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం, బురద చల్లడం తప్ప, సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడూ అమలు చేస్తారో ఇప్పటికీ స్పష్టత లేదు. గడిచిన వంద రోజుల్లో ఒక్కరికైనా రేషన్ కార్డు, పింఛన్ కొత్తగా మంజూరు చేయలేదు.

– బాణాల శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్

కూటమి పాలనంతా అధోగతి



ఎన్నికల ముందు 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు, లేదంటే నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఉద్యోగాల మాట దేవుడెరుగు, ఉచిత ఇసుక ప్రకటనలకే పరిమితమైంది. డబ్బులిచ్చి కొందామన్నా రాష్ట్రంలో ఎక్కడా ఇసుక దొరకడం లేదు. భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కార్మికులకు పనులు లేక పస్తులుంటున్నారు. ఒడిశా నుంచి అధిక ధరలకు ఇసుక తెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదీ వంద రోజుల అధోగతి పాలన.

– బోగవిల్లి గోవింద్, 25వ వార్డు

ప్రజలకు ఏం చేశారో చెప్పండి



కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదు. ఎన్నికల సమయంలో బోలెడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చారు. ప్రెస్‌మీట్లు పెట్టి గత ప్రభుత్వాన్ని విమర్శించడం, తిట్టడం తప్ప చెప్పుకోదగ్గ మంచి పని చేయలేదు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం, ప్రజలను ఉద్ధరిస్తామన్నారు. నేటికీ వాటి ఊసే లేదు. కనీసం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అయినా ఆపండి.

– పి.దుర్గాప్రసాద్, సీతంపేట

ఉచిత బస్సుపై మీనమేషాలు



ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అని ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. ఇంకా అధ్యయనం అంటూ ఏవో కుంటిసాకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అమలు చేశారు. ఇక్కడ మాత్రం మీనమేషాలు లెక్కిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే 87 శాతం హామీలు అమలు చేసి విశ్వసనీయతకు నిదర్శనంగా నిలిచింది.

– సాడి పద్మారెడ్డి, 24వ వార్డు కార్పొరేటర్

వంద రోజులైనా అందని పథకాలు



నూతన ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదు. ముఖ్యంగా యువతకు నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నవారికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, ఇంట్లో ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.1.500 ఇస్తామన్నారు. ఇంతరకు ఇవేవీ అమలు చేయలేదు. దీని వల్ల ప్రతి ఇంట్లోని మహిళ మూడు నెలలకు రూ.4,500 నష్టపోయారు. కూటమి ప్రభుత్వం హామీలన్నీ తక్షణం అమలు చేయాలి.

– సూర్రెడ్డి రాధ, సత్యానగర్

ఇదేం పాలన బాబు



కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనలో ప్రజలెవరూ సంతోషంగా లేరు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ప్రజలు పథకాలు పొందారు. వంద రోజులు గడుస్తున్నా ఒక్క పథకం కూడా కూటమి ప్రభుత్వంలో అమలు కాలేదు. పైగా ఈ సమయాన్ని కూటమి నాయకులు వారిలో వారు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసుకోడానికే ఉపయోగించుకున్నారు తప్ప.. ప్రజలను పట్టించుకోలేదు.

– సనపల నారాయణ స్వామి, మాధవధార, 50వ వార్డు

కుల గణనతోనే నిజమైన ప్రజాస్వామ్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ పూర్ణచంద్రరావు తదితరులు

సీతంపేట: రాష్ట్రంలో కమ్మ, రెడ్ల పాలనతో బీసీలకు అన్యాయం జరుగుతోందని, కుల గణనతోనే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్, మాజీ డీజీపీ కె.పూర్ణచంద్రరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'బీసీల రాజ్యాధికారం-హక్కుల సాధన' అనే అంశంపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. టీడీపీ మేనిఫెస్టోలో రాష్ట్రంలో స్థానిక సంస్థలకు 34 శాతం, అసెంబ్లీలో 33 శాతం రిజర్వేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు ప్రాధాన్యమిస్తామన్నారు కానీ, అవి అమలు కాలేదన్నారు. ప్రస్తుతం పాక్షిక ప్రజాస్వామ్యం నడుస్తోందని, కుల గణనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీల్లో 131 కులాలు ఉంటే ఇప్పటివరకు 111 కులాలు రాష్ట్ర అసెంబ్లీలో అడుగు పెట్టలేదని తెలిపారు. అసెంబ్లీలో స్థానం ఉంటేనే ఆయా వర్గాల అభివృద్ధికి నిధులు వస్తాయన్నారు. పేదరికం, నిరుద్యోగం తగ్గాలంటే జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యేలు రావాలన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తెచ్చేలా ప్రతి జిల్లాలో సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

'కులాంధ్రప్రదేశ్' పుస్తకావిష్కరణ

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి మాట్లాడుతూ వచ్చే నెల 9న విజయవాడలో కుల గణనపై మహా ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యేల కుల గణనపై రూపొందించిన కులాంధ్రప్రదేశ్ పుస్తకాన్ని నేతలు ఆవిష్కరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు, జోనల్ కో ఆర్డినేటర్ పేరుబండి ప్రకాశరావు, రాష్ట్ర కార్యదర్శులు బీను కృష్ణ, సోము రాంబాబు, బీసీ సంఘం నాయకులు కట్టా మల్లేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి 'ఐలా' విరాళం



కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న ఐలా సంస్థ చైర్మన్ జగపతిరాజు

మహారాణిపేట: ముఖ్యమంత్రి సహాయ నిధికి కంచరపాలెంలోని ఐలా(ఐఏఎల్ఏ) సంస్థ చైర్మన్ జగపతిరాజు రూ.50 వేల చెక్కును కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌కు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అందజేశారు. రాష్ట్రంలో ఇటీవల వచ్చిన వరదల నేపథ్యంలో బాధితుల సహాయార్థం రూ.25 వేలు చెక్కు, మరో రూ.25 వేల విలువ గల రొట్టెలు, బిస్కెట్లను జిల్లా యంత్రాంగానికి ఇదివరకు అందించామన్నారు. దీంతో ఒక లక్ష రూపాయలు తమ సంస్థ నుంచి విరాళంగా అందజేశామని కలెక్టర్‌కు ఐలా చైర్మన్ తెలిపారు.

సమష్టిగా పనిచేద్దాం



కొత్త, పాత జెడ్సీలు రాము, కృష్ణలను సత్కరిస్తున్న జోనల్ అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోనల్ కార్యాలయ సిబ్బంది అందరం సమష్టిగా కలిసి పనిచేద్దామని జోన్-5 నూతన కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో శుక్రవారం జెడ్సీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోన్ పరిధిలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి వార్డుల్లో పర్యటిస్తానని తెలిపారు. విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ముందుగా ఆయా శాఖల అధికారులు జెడ్సీ రామును సత్కరించారు. అనంతరం పాత జెడ్సీ ఆర్.జి.వి.కృష్ణకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రెవెన్యూ కమిషనర్ బాబూరావు, రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ కె.వెంకటరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, ఏడుకొండలు, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

మలయాళంలో గురజాడ సాహిత్యం



గురజాడ కథామంజరి మలయాళ అనువాద పుస్తకం

సీతంపేట: గురజాడ అప్పారావు సాహిత్యాన్ని 'గురజాడ కథా మంజరి' పేరిట మలయాళ భాషలోకి నగరానికి చెందిన ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి అనువదించారు. మలయాళ భాషలోకి అనువదించిన గురజాడ అప్పారావు తొలి సాహిత్యం ఇదే కావడం విశేషం. ఇందులో గురజాడ రచించిన ఆరు కథలతో పాటు, దేశభక్తి గేయం ఉంది. గురజాడ సాహిత్యంపై ప్రముఖ రచయితలు విహారి, వివినమూర్తి, చాగంటి తులసి, అట్టాడ అప్పలనాయుడు, కె.పి. శివకుమార్, డాక్టర్ ఎస్.రజని, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య కిన్నెర శ్రీదేవి, కిరణ్ ప్రభ రాసిన వ్యాఖ్యానాలు ఇందులో ఉన్నాయి. ఈ గురజాడ సాహిత్య పుస్తకాన్ని ప్రముఖ రచయిత రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తెలుగులో ముద్రించారు. గురజాడ ఫౌండేషన్ (అమెరికా) అధ్యక్షుడు కొవ్వలి గోపాలకృష్ణ వినతి మేరకు ప్రముఖ అనువాద రచయిత ఎల్.ఆర్.స్వామి గురజాడ కథామంజరి పేరిట మలయాళంలోకి అనువదించారు. ఈ అనువాద పుస్తకాన్ని పరిధి పబ్లికేషన్స్(తిరువనంతపురం, కేరళ), గురజాడ ఫౌండేషన్ సంయుక్తంగా ప్రచురించాయి. ఈ పుస్తకాన్ని త్వరలో తిరువనంతపురంలో ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించనున్నట్టు రచయిత ఎల్.ఆర్.స్వామి తెలిపారు.

తీరంలో గుర్తు తెలియని మృతదేహం



తీరానికి కొట్టుకొచ్చిన మృతదేహం

భీమునిపట్నం: భీమిలి సముద్ర తీరానికి శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చింది. ఇక్కడ మార్లిన్‌కే రెస్టారెంట్ వెనుకభాగంలోని తీరంలో 40 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలియజేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ బి.సుధాకర్, ఎస్ఐ హరీష్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుడి చేతిపై 'రాధ' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహా అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

మర్రిపాలెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో శుక్రవారం మహా అన్నసంతర్పణ చేపట్టారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ముఖ్య అతిథిగా కార్యక్రమాన్ని ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా రోడ్డుపైనే భవన నిర్మాణ సామగ్రి



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రోడ్డుపై వదిలేసిన ఇసుక, పిక్క మట్టి

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణం పూర్తి చేసిన ఒక బిల్డర్ భవన నిర్మాణ సామగ్రిని నెలల తరబడి రోడ్డుపైనే వదిలేయడంతో సమస్యాత్మకంగా మారింది. ఇక్కడి అజిత అపార్ట్‌మెంట్ రోడ్డులో ఒక బిల్డర్ అపార్ట్‌మెంట్ నిర్మించి, పనులు పూర్తి చేశాడు. ఆరు నెలలు కావస్తున్నా.. ఇసుక, మట్టి, కంకర పిక్క వంటి భవన నిర్మాణ సామగ్రిని తొలగించకుండా రోడ్డు మీదే వదిలేయడం బిల్డర్ నిర్లక్ష్యాన్ని చూపుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సామగ్రి కారణంగా ఈ మార్గంలో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలుగుతోందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో ఈదురు గాలులకు మట్టి, ఇసుక, దుమ్మూ ధూళీ సమీపంలోని ఇళ్లలోకి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ తదితరులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ జోన్-3 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

యునెస్కో సదస్సుకు ఇంటాక్ కన్వీనర్



రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: యునెస్కో, జీఎస్ఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చర్ హెరిటేజ్ (ఇంటాక్) విశాఖ చాప్టర్ కన్వీనర్, జియో హెరిటేజ్ అడ్వైజర్ డి.రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఢిల్లీలోని యునెస్కో హౌస్‌లో సెప్టెంబర్ 23 నుంచి 26 వరకు 'ఫస్ట్ కెపాసిటీ బిల్డింగ్ ట్రెనింగ్ కమ్ వర్క్‌షాప్ ఆన్ యునెస్కో గ్లోబల్ జియోపార్క్స్' జరగనుంది. చర్చావేదికలో జియోపార్క్‌ల మూలాలు అనే అంశంపై ప్రసంగించేందుకు రాజశేఖర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. మొదటి రెండు రోజులు వర్క్‌షాప్ జరుగుతుందనీ.. చివరి రోజున రాజస్థాన్‌లో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుందని ఆయన తెలిపారు. భారత్‌లో గ్లోబల్ జియోపార్క్‌లు ఏర్పాటు చేసేందుకు యునెస్కో తీసుకుంటున్న చొరవ ప్రశంసనీయమని.. ఈ వర్క్‌షాప్‌కు ఆహ్వానం లభించడం సంతోషంగా ఉందని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

పిచ్చిమొక్కల నడుమ తహసీల్దార్ కార్యాలయం



కార్యాలయ ఆవరణలో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

సీతమ్మధార: సీతమ్మధార మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తుప్పలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కార్యాలయంలోకి బుధవారం కోడెనాగు ప్రవేశించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్యాలయ ఆవరణలోని పొదల్లో ఇంకెన్ని పాములు ఉన్నాయోనని సిబ్బంది హడలి పోతున్నారు. ఆవరణలో చెత్తాచెదారం కూడా పేరుకుపోతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. తహసీల్దార్ కార్యాలయానికి సర్టిఫికెట్లు, సర్వే నిమిత్తం రోజూ అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కార్యాలయ ఆవరణలో పారిశుధ్య లోపం, పిచ్చిమొక్కలు, పొదలు చూసి వారంతా విసుగు చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పిచ్చిమొక్కల తొలగింపు, శుభ్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.